# దగ్ధజీవితం

చీకటిరాత్రి పందిరివేసి ముసుగు కోడూరు గ్రామాన్ని ముసురుకుంది. పరుచుకున్న చీకటి పొరల్ని చీల్చుకుంటూ నక్షత్రాలకాంతి మూగ వేదనతో సాగుతున్న కాలంమీద పడుతోంది.

పద్నాలుగు సంవత్సరాల తర్వాత కోటయ్య మళ్ళీ ఆ కాలవగట్టు మీదకొచ్చి అక్కడే నిలబడిపోయాడు శిలలా. కోటయ్య కళ్ళు కాలవవతల మిణుకు మిణుకు మంటున్న పాలెం దీపాలు చూసి పరవశించిపోతున్నాయి. వెదుకోవున్నా అతని కళ్ళుమాత్రం పాలెం వైపు, పాలెంలోఉన్న తన ఇంటివేపూ ఇంత కాలంనుంచీ చూస్తూనే వున్నాయి.

ఈరోజుకోసమే స్తబ్ధతలో జీవిస్తూ సంవత్సరాలను గడిపేశాడు.

మనసు సముద్రంలా పొంగుతూంది.

ఆప్యాయతా, అనుబంధమూ జలపాతాల్లా ఉరికిపడుతున్నాయి.

కాళ్ళకు సంకెళ్ళుపడ్డట్టు అడుగుముందుకు పడటంలేదు.

మనసన్నా, హృదయమన్నా తనకు తెలియన్ను అనాడు కానీ ఇప్పుడు వేరు. బరువుగా నిట్టూర్చాడు.

తన చేతిలోవున్న గీతనీ, గాంధీ వ్రాసిన పుస్తకాన్నీ ఒకసారి గుండెల కదుముకున్నాడు. తృటికాలం బరువుగా కళ్ళుమూసుకొన్నాడు.

దూరానఎక్కడో నక్కలు కూస్తున్నాయి.

తాను దిగిన రైలు, స్టేషనువదిలి ముందుకు పరుగెడుతోంది కొంతదూరంలో.

చుట్టూ గుబురు గుబురుమంటున్న చీకటి ముసుర్లు!

పైన తారల దుప్పటికప్పుకున్న ఆకాశం!

తన ఎదురుగా రాళ్ళ రప్పలమీదుగా గల గల ధ్వనులతో నెమ్మదిగా ముందుకు కదిలే కాలవ. మోకాటిలోతు కాలవదాటి అవతలివైపు వెళ్ళి, వరిపొలాల గట్లంట కొంచెందూరం నడిస్తే పాలెం వస్తుంది. కాని ఆ పాలెంలో ఒకనాటి క్రూరుడూ, ద్రోహీ, దొంగా అడుగు పెడుతున్నాడు మళ్ళీ నేడు తాను పూర్తిగా మారిపోయినా అది అర్థం చేసుకునే దెంత మంది? అలాగనుకుంటూ వెనక్కిపోలేదు.

అక్కడ తనరక్తాన్ని పంచుకుపుట్టిన బిడ్డ ఉన్నాడు. తనను నమ్ముకున్న భార్యవుంది. వాళ్ళు తన కళ్ళల్లో కాంతిపుంజాలు. తన గుండెలో ఇంకానిలిచిన ప్రాణంలాంటి వాళ్ళు.

నేరం చేసినందుకు న్యాయశాస్త్రం తలను నరికేస్తే ఈవ్యధ తప్పునేమో!.... కాని నరికెయ్యవలసిన తన తలకి చదువుల పేరిట నీతి, జ్ఞానమూ, మంచీ, మానవత్వమూ పద్నాలుగు సంవత్సరాలు బోధించింది. అన్ని సౌందర్యాల్లోకి ఉన్నతమైన మానసిక సౌందర్యాన్ని తెచ్చిపోసింది. గాంధీనీ, క్రీస్తునీ, బుద్ధునీ గుండెలలో నింపేసింది ఖైదులో బడిపెట్టి బండరాతిలాంటి తనను మనసున్న మనిషిలా మార్చేసింది చట్టం. కటికచీకట్లను పారదోలి మళ్ళీ బ్రతుకులో వెలుగుతెచ్చింది. ఈ వెలుగులో ఆనాడు చేసిన భయంకరనేరాలన్నీ కళ్ళముందు కనబడుతున్నాయి. న్యాయంకోసం అరుస్తూ అర్థిస్తున్నాయి. ఏదో శక్తి నిలువునా తనను చీల్చివేస్తూంది. తానుచేసిన ఆ పాపకృత్యాలే తిరగబడి నిప్పు కణాలతో మీదబడి నరుకుతున్నట్టుంది.

చలిగాలి రివ్వున వీచింది.

గతంలో కరుగుతూ అలాగే నిలబడి ఉన్నాడు కోటయ్య కాలవ గట్టుమీద. ఇంకా తనలో బలహీనత చావలేదు. అంత రాత్రి పాలెంకి వెడితే తననెరిగినవాళ్ళంతా భయంతో గావుకేకలేస్తారు. కబళించడానికొస్తున్న పులిని చూసినట్టు పారిపోతారు. కండకావరంతో విర్రవీగుతూ, అడ్డమొచ్చిన వాళ్ళ రక్తం



కళ్ళజూస్తూ అబలల్ని నేలరాసివేసిన ఆ రోజులు మరచిపోగలుందా ఈ ప్రజ.

పీకలుకోసి పొట్టనింపుకున్నాడు. పెళ్ళాం బిడ్డల్నికూడా రక్తపుకూడుతోనే పెంచాడు గానీ, కష్టించి గుప్పెడు మెతుకులు తేలేదు. రౌడీగా, దొంగగా, జల్సారాయుడిగా, కొందరి కుయుక్తులను నెరవేర్చే కత్తిగా బ్రతికాడు కోటయ్య. న్యాయాన్యాయాలన్నా, నీతి నిజాయితీఅన్నా, మానమర్యాదలన్నా తనకు తెలియవు. తెలుసుకోవడానికి ఎప్పుడయినా ప్రయత్నం చేశాడా-లేదు.

ఇపుడు కోటయ్య మనసులో కొండంత ఆత్మ విశ్వాసం వుంది. తనూ ఓ మనిషి. మానవత్వంగల మనిషి! రేయింబవళ్ళు శ్రమిస్తాడు. ఆ కష్టార్జితంతో తన కుటుంబాన్ని పోషిస్తాడు

తనను అసహ్యించుకున్న ఈ మనుషుల్ని ప్రేమించి వాళ్ళచేత ప్రేమింపబడాలి తన బిడ్డల్ని ఈ దేశంలో గౌరవనీయులైన పౌరులుగా తీర్చిదిద్దాలి. కాని అంతకుముందు తాను రైల్వే ప్లాట్‌ఫారంమీద చూసిన నిర్భాగ్యుల్లా కాదు.

రైలు గేటుదాటి వస్తూండగా కాలూ, చేయీలేని ఓ బిచ్చగాడు పొట్టకొట్టుకుంటూ చలిలోపడి, అందర్నీ అర్థిస్తున్న సంఘటన కోటయ్యకు తన ఆలోచనలతోపాటు లీలగా గుర్తుకొచ్చి మాయమైంది.

నేరస్థులంటూ కాళ్ళూ చేతులున్న తన లాంటి వేలాది మందిని ఖైదులో ఉంచి కాపాడుతుంది చట్టం. కాని ప్రయోజకుల కావలసిన ఈ పసివాళ్ళనీ, ఏవో కారణాల వల్ల కాళ్ళూ చేతులూ కోల్పోయిన ఈ వయస్సులో వున్న అభాగ్యుల్నీ, శ్రమించడానికి సిద్ధంగా ముందుకొచ్చి పని కావాలంటూ ఆకలి మంటలతో అలమటించే నిర్భాగ్యుల్ని, రైల్వే స్టేషన్లలోనూ, రోడ్ల మీదా, చీకటి కోణాల్లోనూ ఎందుకు వదిలేస్తుంది?

బయట ప్రపంచాన్ని చూసిన తర్వాత, ఎన్నడూలేని కొత్త ఆలోచనలు కోటయ్యలో ఉదయించాయి. ఇవి ఆలోచనలు కావు-సజీవ సమస్యలు, మానవ మనుగడలో అడుగడుగునా అడ్డుపడుతున్న తీరని అగాధాలు. శాంతికీ, ప్రగతికీ అవరోధాలు

ఉన్నట్టుండి మర్రిచెట్టు అవతల వైపున్న చెట్ల ముసుగులోంచి నాలుగు మగకంఠాలు వినబడ్డాయి. వాళ్ళతోపాటు ఒక ఆడగొంతు, వాళ్ళను కవ్విస్తూ, అల్లరిగా మాట్లాడుతూంది. ఆ మనుషులు అటువైపుగానే ఆడమనిషితో సహా పాతగుడివైపు వెళ్ళిపోయారు.

పాతగుడి!

భక్తులు కొత్తగుళ్ళకోసం పరుగెత్తిన తర్వాత, కాలవ గట్టునున్న గుడి పాతబడి కొన్ని సంవత్సరాలయింది. పవిత్రమైన ఆలయం పాడుబడడంతో, పాపాలకు నిలయమైపోయింది. రకరకాల వాళ్ళంతా అన్ని వైపులనుంచీ ఆపాతగుడిదగ్గరకే చేరుతారు రాత్రయ్యేసరికి.

కోటయ్యకు పాతగుడంటే బాగాతెలుసు తాను కామాంధుడయి కోడెనాగులా ప్రవర్తించే రోజులలో ఎంతమంది ఆడవాళ్ళు తన కాటుకి బలికాలేదు ఆ పాతగుడిదగ్గర. ఆ గుడిచుట్టూ కోటయ్య కథలు కదులాడుతునే ఉన్నాయి. పొగలు సెగలు కక్కిన ఆ రోజులు తన బ్రతుకు బండను మళ్ళీ పిండిచేస్తున్నాయి

సిగ్గుతో, అభిమానంతో, పశ్చాత్తాపంతో విలపిస్తున్న కోటయ్య నేత్రాలలో నిండిన అశ్రువులు వాటంతటవే అగ్నికణాల్లా రాలిపడ్డాయి

ఇక తప్పదు అక్కడ నిలబడేకొద్దీ తన హృదయ గాయం మరింత పెద్దదవుతుంది గానీ మానదు. విశ్వంలో ఒకడే మనిషిలా-ఆ విశాల ప్రకృతి ఎదుట తానొక్కడే నిలబడి వున్నాడు.

ఒక్కడుగు ముందుకేశాడు.

కాలవలోంచి గబగబా ముందుకు ఏదో ఆకారం వస్తూంది.

కోటయ్య ఆగిపోయాడు,

నిదానించి చూశాడు.

ఎవరో స్త్రీ!

ఏడుపో నవ్వో అర్థంకాకుండా తనలో తానేదేదో అనుకుంటూ నీటిలోంచి చరచరా నడిచివచ్చేస్తోంది. తలంతా విరబోసుకున్నట్టున్నది. ఆమె నీళ్ళుదాటి గట్టెక్కి తిన్నగా వెళ్ళిపోయింది.

కోటయ్య కొంత దూరాన అలాగే నిలబడి పోయాడు. ఏదో అడగాలనుకున్నాడు. కాని ఆశ్చర్యం నుంచి తేరుకునే లోపునే ఆమె ఆ చీకటిలో చీకటైపోయింది.

అంత రాత్రి, ఆ చలిలో ఎవరో స్త్రీ ఎక్కడికో వెళ్ళిపోతూంది — ఏ తల్లి కన్నబిడ్డో, ఏ కర్కోటకుడి పాపాలకు బలయిన ఇల్లాలో, ఏమిటిదంతా? తానెన్నో ఆదర్శాల్ని ఆపాలెం లోని ప్రజలలో చూడాలనుకుంటున్న తనకి ఇటువంటి సంఘటన ఎదురైందేమిటి?

కోటయ్య గట్టు దిగాడు. ఎన్నాళ్ళకు మళ్ళీ ఆ కాలవలో అడుగుపెట్టే అదృష్టం కలిగింది. ఈకాలవే పాలెం వాళ్ళకు గంగంత గొప్పది!

ఒక్కడుగు ముందుకు వేశాడు.

రెండో అడుగు నీళ్ళలో పడేసరికి కోటయ్య ఒళ్ళు ఝల్లుమంది.

గుండెలు జలదరించాయి

శరీరం వణికిపోయింది.

నిలువునా చలించి పోతున్నాడు.

తన కాలు పడింది నీటిలో కాదు నెత్తురులో.

కిందికి చూశాడు

అదంతా నెత్తురు-

తన కాలు రక్తంలో తడుస్తూంది.

కోటయ్య తలెత్తాడు.

ఎదురుగా ఎవరో నిలబడ్డారు.

కోటయ్య భయముతో నిశ్చేష్టుడై చూస్తున్నాడు ఆ వ్యక్తి వైపు

వికృతంగా నవ్విందా ఆకారం,

"కోటయ్యా!" నవ్వుతున్నాడు మళ్ళీ,

"ఎవరునువ్వు?" కోటయ్య కంగారు పడుతున్నాడు.

"హుం-నన్నింకా నువ్వు గుర్తించలేదా? ఈ నెత్తురు కాలవ నాదే! దాహంగా వుందా? తాగు, కడుపారా తాగి, నీ రక్తదాహం చల్లార్చుకో-నువ్వు-చూస్తావేం-తాగు-తాగు" అంటూ హేళనగా వికటంగా నవ్వుతున్నాడు

"ను-వ్వు. ను-" మళ్ళీ అదేప్రశ్న వేయబోయాడు.

"ఎవరో గుర్తించలేదా?" అప్పుడే ఎలా గుర్తించగలవు?

నా ఆత్మలా నీ ఆత్మ క్షోభించలేదు. నా హృదయంలా నీహృదయం విలపించలేదు. అటువంటప్పుడు కోటిమానవుల్ని నీవెలా గుర్తించగలవు కోటయ్యా?"

"వద్దు నన్నిలా హింసించవద్దు"

"హింసించడమే నీ వినోదం. మృగంలా నీతోటివారి మీదపడి కబళించడమే నీకానందం,"


"కాదు-కానేకాదు"

"కాదంటేపోదు కోటయ్యా-కాలేకడుపుతో అలమటించే బలహీనుల పొట్టలు కొట్టి నీ పెళ్ళాం బిడ్డలను పెంచుకొచ్చావ్-దొంగతనాలూ, దోపిడీయూచేసి సుఖాలు వెళ్ళ

బచ్చావ్-కంఠకావరంతో చేయరాని ఘోరాలు చేసి అమాయక స్త్రీలనెందర్నో అల్లాడిం చేశావ్-రౌడీగా రోజులు వెళ్లదీస్తూ రాజాలా బ్రతికేశావ్! చెప్పు-ఇప్పుడు చెప్పు-నువ్వు పొందిన ఆనందమూ అనుభవించిన భోగాలూ చాలేనా-టావా-చెప్పు-చెప్పు కోటయ్యా."

"నేను వినలేను - గతం గుర్తుచెయ్యకు-నన్నర్థం చేసుకో."

అతని మాటకడ్డొస్తూ "అర్థం చేసుకున్నాను. బాగా అర్థంచేసుకున్నాను. డబ్బుగలవాళ్ళు మాత్రమే ఈ సఘంలో అమాయకుల్ని అన్యాయంగా పీడిస్తున్నారని కక్షతో



పడగ విప్పాయి
ఫొటో—వి. వి. సూర్యనారాయణ (హైదరాబాదు)

రగిలే ఈ ప్రజలు సామాన్య మానవునితో మసిలే నీవంటి మానవరూపంతున్న రాక్షసుల్ని చూడలేదు. నీవంటినీచులు చేస్తున్న ఘోర కృత్యాలు తిరిగి ధనికులమీదో, పదవుల్లో ఉన్న వాళ్ళమీదో తోసేసి వాళ్ళని నరరూప రాక్షసులనీ, సంఘద్రోహులనీ తిట్టిపోస్తారు. మూర్ఖత్వంతో నువ్వు నీతోటివాళ్ళ కళ్ళు చెదిమితే దానిని ఎవరో పెద్దవాళ్ళమీద పడేసేసి ఆ గ్రహంతో పళ్ళు నూరుకుంటారేగాని వాళ్ళలో ఒకడైన నీవల్ల యింతమంది అంధకారంలో కుమిలిపోతున్నారని తెలియదు."

"ఇంతకీ నువ్వెవరవు?"

"నువ్వు వెలిగించిన చీకట్లో కుమిలిపోతున్న మనిషిని."

"నేనెందరి జీవితాల్లోనో చీకటిపోశాను. అందులో నువ్వెవరివో నాకేం తెలుసు" బాధపడుతున్నాడు కోటయ్య.

అవతలమనిషి అతన్ని గమనించే స్థితిలో లేడు.

"హుఁ రాబందుకేం తెలుసు - తానెన్ని శవాల్ని తిందో. పెద్దపులికేం తెలుసు - తానెన్ని గొంతుకలు కొరికిందో - నువ్వూ అంతే"

"కాదు-కానేకాదు-నేనా కోటయ్యను కాదు ఇప్పుడు."

"పద్నాలుగు సంవత్సరాలు ఖైదులో వున్నంతమాత్రాన కోటయ్య కోరలు పోకుండా ఉంటాయా?"

"అయితే నా గురించి నీకు బాగా తెలుసన్నమాట"

"నీగురించి నాకు తెలిసినంత బాగా ఇంకెవరికీ తెలియదు కోటయ్యా."

"అయితే ఇంతరాత్రివేళ ఇక్కడేం చేస్తున్నావ్?"

"నీకోసం ఎదురుచూస్తున్నాను."

"నాకోసమా?"

"అవును-ఒకటీ రెండు సంవత్సరాల నుంచికాదు. పద్నాలుగు సంవత్సరాలనుంచి."

"ఆ, పద్నాలుగు సంవత్సరాలను-చి-ఎందుకు? చెప్పు త్వరగా చెప్పు."

"చెబుతాను తప్పకుండా చెబుతాను, నా బాధంతా చెప్పుకోడానికే ఇన్ని సంవత్సరాలుగా నీకోసం ఇక్కడ ఎదురుచూస్తున్నాను నీకంటే నన్నెవరూ అర్థం చేసుకోలేరు నీకంటే నామీద సానుభూతి చూపించేవారులేరు. అందుకే నీకోసం చూస్తున్నాను అప్పుడు నా మనసు బాధతో విలవిల్లాడుతున్నప్పుడూ, నా ప్రాణం ఆఖరిఘడియల్లో కొట్టుమిట్టాడుతున్నప్పుడూ నువ్వొకసారి నన్ను చూసావ్?"

మళ్ళీ దూరాన నక్కల కూతలు

గుర్తెలియని ఆ ఆకారం చెప్పేదంతా వింటున్నాడు కోటయ్య

"నువ్వు ఆవేళరాత్రి ఈగట్టు దిగుతుండగా నీటిలోంచి గట్టుమీదకు వస్తున్న నన్ను ఆపావు. అప్పటికే నాభార్య గవర్నమెంటు హాస్పిటల్లో చావుబతుకుల్లో ఉంది. దాన్ని ఇంకో పెద్దాస్పిటల్‌కి తీసుకెళ్ళి వెంటనే ఆపరేషన్ చేయించకపోతే బ్రతకదని డాక్టర్ చెప్పాడు. ఆపరేషనంటే మాటలుకాదు, ముందు డబ్బు పోయకపోతే రోగిని చూడరు. అందుకని దానిమెళ్ళో మంగళసూత్రం తీసుకొని దాంతోపాటు ఇంట్లోఉన్న చిన్నచిన్న సామాన్లన్నీ అమ్మెయ్యగా వచ్చిన మూడొందలూ పట్టుకొని స్టేషన్‌కి పరుగెడుతున్నాను."

కోటయ్య అంతరంగంలో తుఫాను రేగింది.

"నేనెక్కడికెళుతున్నానో నువ్వు తెలుసుకున్నావు కాబోలు. నాకడ్డం వచ్చావ్ - నీ పెళ్ళాం చస్తే చావనీయ్ - కాని నా కా మూడువందలూ ఇచ్చేయ్ - లేకపోతే నువ్వు కూడా చస్తావని నన్ను బెదిరించావ్ నా బిడ్డల ముఖమన్నాచూసి నన్ను వెళ్ళిపోనిమ్మన్నాను. మళ్ళీ తిరిగొచ్చిన తర్వాత నాకు కలిగున్న మట్టుకు ముట్టజెప్పుకుంటానన్నాను. నువ్వు నాభార్య చావుకైనా అంగీకరించావు గానీ, ఆ డబ్బుమాత్రం నీకివ్వందే నన్ను కదలనివ్వనన్నావు. అసలే నువ్వో హంతకుడివి. ఆరాత్రివేళ ఒకడివ్వి నీతోపేచీ పెట్టుకుంటే నువ్వేదో అక్రమానికి తలపడతావని నిన్ను బ్రతిమాలుకున్నాను. నీకాళ్ళు పట్టు

కున్నాను. నీకు జాలికలుగలేదు నా జేబులోంచి డబ్బు లాక్కుంటుంటే నిన్ను గింజా కొని నాలుగడుగులు ముందుకువేశాను. అంతే నాతలమీద నువ్వో పెద్దరాడు పుచ్చుకొని కొట్టావు నేను అక్కడే పడిపోయాను తల పగిలి నా జేబులోంచి డబ్బంతా కాజేసి నన్ను గబగబా కాలవలోకి తుడ్చేశావ్"

ఉపాసుమధ్య చిక్కినట్టు ఊగిపోతున్నాడు కోటయ్య.

"ఇది పటికాలవకాదు. నా నెత్తురుకాలవ కోటయ్యా!"

కోటయ్య గుండెల్లో మరో భూగోళం బ్రద్దలయ్యింది,

ఆ నిశ్శబ్దవాతావరణం దద్దరిల్లేలా కోటయ్య— "రంగన్నా" అంటూ అరిచాడు.

రంగన్న ఆకారం. కళ్ళముందే మాయమైంది.

కాలవ యథాతిథిగా ప్రవహిస్తోంది.

కోటయ్య గబగబా కాలవలోంచి నడిచి ఆ పొలంలోకి నడిచాడు.

పొలంమాత్రం అప్పటిలాగేఉంది. పొలం ఎంతో మారిపోయుంటొచ్చను కున్నాడు. కాని కనలో వచ్చిన మార్పు అపొలంలో కన్పించలేదు.

తోట ఇంటివైపు వెళ్ళాడు.

అదేమిటి— అది తనఇల్లేనా?

పెంకప్పు కూలిపోయింది.

గోడలు పడిపోయాయి.

త్వరలో ఆనవాలులేకుండా భూమిలోకలిసి పోవడానికి సిద్ధంగా ఉన్నాయి.

బావురుపిల్లి ఒకటి బయటఎక్కడినుంచో పరుగెత్తుకొచ్చి ఇంట్లోకి దూరింది.

కోటయ్య ఇంటిచుట్టూ తిరిగాడు.

తన భార్యా, పిల్లలూ ఏమైపోయారు.

అతని ఆశంతా హరించుకు పోతుంది.

తనని చూసి పక్కింటి గుమ్మంలో పడుకుని ఉన్న కుక్క మొరుగుతోంది.

తలుపు తెరుచుకుంది.

దగ్గుకుంటూ బయటకొచ్చాడు దుర్గయ్య పైమీద రగ్గు కప్పుకుంటూ,

వెలుగు రేఖల్లో వున్న దుర్గయ్యను కోటయ్య గుర్తించాడు.

అటువయిపే నడిచి. నీరసించి పోయిన దుర్గయ్యను ఆత్రంగా "అన్నయ్యా" అని పలకరించాడు.

ఆనవాలు పట్టలేని దుర్గయ్య, విదానించి చూస్తూ.

"ఎవరు బాబూ?" అన్నాడు.

"నేను—కోటయ్యను"

దుర్గయ్య ఆశ్చర్యంతోపాటు కొంత కలవరపడ్డాడు.

ముందుకెళ్ళి కోటయ్యను విదానించి చూశాడు.

ఒకసారి నిస్పృహగా నిట్టూర్చి "ఇంకా ఈ పొలాన్ని. నీ పెళ్ళాం—బిడ్డల్ని మరచి పోలేదా కోటయ్యా" అన్నాడు ఏదోచూస్తూ.

"నేనెలా మరువగలను. నేను పాడుచేసిన ఈ ఊరును మళ్ళీ నా రక్తంతో కడిగి పూజించాలనీ, మన గాంధీగారు చెప్పినవన్నీ చేసి చూపించాలనీ నాలాగే నా బిడ్డలు కూడా చెడుమార్గాలు పట్టకుండా, వాళ్ళని మంచి మార్గాన పెట్టాలనీ ఎన్నెన్నో ఆశలు పెట్టుకుని వచ్చాను అన్నయ్యా."

"ఎంత గొప్పవాడివయ్యావు! ఇప్పుడు నువ్వు కోటయ్యవుకాదు: నువ్వు మారి పోయావు — పూర్తిగా మారిపోయావయ్యా!"

దుర్గయ్య — అతన్ని పరీక్షగా చూశాడు. రక్తంతో, కత్తులతో ఉండే ఆ చేతుల్లో పవిత్రగ్రంథాలున్నాయి క్రౌర్యంతో, అహంతో, రాక్షసత్వంతో నిండివుండే ఆ ముఖంలో ప్రేమా, కరుణా, దయా తొణికిసలాడు తున్నాయి.

"నా బిడ్డలూ భార్యా ఎక్కడున్నారని అడిగాడు కోటయ్య తన అనురాగా వేశాన్ని ఆపుకోలేక.

దుర్గయ్య కొన్నేపు మాట్లాడలేదు. అయినా చెప్పడం తప్పదని. "కోటయ్యా! నువ్వు జైలుకెళ్ళిన తర్వాత నీ కుటుంబం కష్టాల్లో పడిపోయింది. గడపదమే గడ్డయి పోతే, ఎప్పుడూ పంకముఖం చూడని నీ పెళ్ళాం, కాయకష్టం చేస్తూ పసివాళ్ళను పెంచుకోడానికి నానాపాట్లూ పడింది కాని నీ అక్రమాలకు బలైపోయిన మనుషులంతా నీమీద కక్షకొద్దీ నీపెళ్ళాన్ని పనిపెట్టుకుని పాడుచేశారు. ఈపొలంలో అద్దమైన వాడూ దానిని అనుభవించి తన యిష్టమొచ్చినట్టు హింసలుపెట్టాడు. తాను నాశనమైపోయినా పిల్లల్ని ఆ కూపంలో పడకుండా పెంచాలను కుంది నీపెళ్ళాం. కాని మాటు వేసుకు చూస్తున్న సంఘం నీకూతురు యవ్వనంలో అడుగెట్టగానే దాని శీలాన్ని చిదిమేసి దాని బతుకును బజారులో పెట్టింది."

"తమతో చెలగాటమాడుతున్న ఈమనుషులంటే కోపం నీకొడుక్కి. వాడుఎలాగైనా కక్షతీర్చుకుంటాడనీ, లేకపోతే వాడు కూడా నీలాగే తయారౌతాడేమోనని ఈ ఊరునుంచి తరమాలనుకున్నారు. దొంగతనాలూ, లేనిపోని నేరాలూ వాడిమీద అంటగట్టారు ఓర్చుకోలేక వాడు ఎదురుతిరిగాడు. కాని పందమంది పులులమధ్య ఒక మేకపిల్ల ఏంచేయగలదు? కడకి ఒక రోజున వాడి చేయీ, కాలూ విరగ్గొట్టారు ఎవరో!"

కోటయ్య నిర్జీవంగా చూస్తున్నాడు.

తనపైన ఆకాశం బ్రద్దలయి కటికచీకటి సముద్రంలా భూమిమీద కురుస్తున్నట్టుంది!

అప్పటికే తన చేతిలో గీతా, గాంధీ పుస్తకాలు పడిపోయాయి.

"కాలూ చేయీ లేని నీ కొడుకు ఆ రైల్వే స్టేషన్లో అడుక్కుంటున్నాడు. పొట్టకోసం ఒళ్ళమ్ముకుంటూ ఆ పాతగుడికాడ పడుంది నీ కూతురు."

నరాల్ని కుదిపి వూపించే చలిగాలి హోరుమన వీచింది.

చట్టం సహాయంతో తీర్చిదిద్దుకున్న తన జీవితంతోపాటు. తన వాళ్ళనికూడా మరింత గొప్పవాళ్ళని చెయ్యాలనుకున్నాడు. ఆశలూ, ఆదర్శాలూ పెంచుకున్నాడు. కాని ఎదురైంది ఏమిటి?

"నాకో ఆడదిక్కు ఉంటుందనీ, దానికో నీడ వుంటుందనీ నా పెళ్ళాన్ని నేను పోషిస్తూ రెండు సంవత్సరాలు కాపరం చేశాను. కాని ఈ మనుషుల కారణంగా అప్పటికే దాని ఒంటికి భయంకర కుష్ఠురోగం సోకింది. ఇక దానితో కాపరం ఘోరమని నాకు తెలుసు. అందుకనే నేను దాన్ని మళ్ళీ బయటకు గెంటేశాను తమ్ముడూ— ఏదిక్కూ లేని నీపెళ్ళాం మతిచెడిపోయింది. కుష్ఠురోగంతో దానిఒళ్ళు కుళ్ళిపోయింది ... పాపం అది ఈ పొలంనుంచి ఆ కాలువ వరకూ పగలూ రాత్రనకుండా తిరుగుతూ ఉంటుంది."

ఖైదులో కళ్ళుతెరిచిన కోటయ్య తన చుట్టూ కమ్ముకున్న అంధకారంలో కోటిజ్యోతులు వెలిగించాలనుకున్నాడు. కానిజ్యోతులు అంధకారాన్ని మింగలేకపోతున్నాయి. అంధకారమే జ్యోతుల్ని మింగుతోంది

చట్టం తనని మార్చివేసింది. చదువుచెప్పి జ్ఞాననేత్రం విప్పింది. రేపో మాపో భూమిలో కలిసిపోవలసిన తనని ఉద్ధరించింది ఈచట్టం, అన్నెం పున్నెం ఎరుగని అమాయకులలైన తన కొడుక్కీ, కూతురుకీ, భార్యకీ ఎవరేశారీ శిక్ష? ఎందుకీ శిక్ష?. ✻